క్లుప్తంగా

వైభవుడికి నేడు సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తామన్నారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుందని చెప్పారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తామన్నా రు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు స్వామికి సమర్పిస్తామని ఈవో తెలిపారు.

డీసీఎంఎస్ బీవోఎస్ చైర్మన్‌గా వెంకటేశ్వర్లు



ఏయూ వీసీ ప్రసాదరెడ్డి నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న వెంకటేశ్వర్లు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఆచార్య పి.వెంకటేశ్వర్లు నియమితుల య్యారు. ఈ మేరకు ఆయన ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి నియామక ఉత్తర్వులు స్వీకరించారు. అనంతరం విభాగంలో బీవోఎస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆచార్య వెంకటేశ్వర్లు ప్రస్తుతం ఏయూ డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయం గౌరవ గ్రంథాలయాధికారిగా సేవలు అందిస్తున్నారు. ఆర్ట్స్ కళాశాల వార్డెన్‌గా కూడా సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆచార్య వెంకటేశ్వర్లును విభాగ ఆచార్యులు, ఉద్యోగులు అభినందించారు.

ముస్లింల చందనోత్సవ యాత్ర



మర్రిపాలెంలో వేడుకలు చేసుకుంటున్న ముస్లింలు

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెం మసీద్ వీధిలో మస్జిద్-ఈ-అల్ ఫతా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం హజ్రత్ ఖాదర్ వలీ, హజ్రత్ మౌలా అలీ నిషానీ ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రిపాలెం శ్యామ్ నగర్ కాలనీ, గ్రీన్ గార్డెన్స్, పార్వతీ నగర్, హుస్సేన్ నగర్, జాకీర్ హుస్సేన్ నగర్ తదితర ప్రాంతాల్లో చందనోత్సవ యాత్ర చేశారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ధమాల్ పార్టీ పలువురిని ఆకర్షించింది. యాత్ర అనంతరం ముస్లింలు మసీదు సమీపంలోని హజ్రత్ ఖాదర్ వలీ, హజ్రత్ మౌలా ఆలీ వారి నిషాని షరీఫ్ వద్ద ఫాతెహా తబ్రుక్ అందజేశారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ పర్యవేక్షించిన కార్యక్రమంలో బాబా, ఉమర్, ఉర్స్ కమిటీ సభ్యులు మున్నా, నాసీర్ ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

దాబాగార్డెన్స్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటుకు మంచి అవకాశాలున్నాయని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎంఏ రహీం తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లతో పీఎంఎఫ్ఎంఈ స్కీంపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం ద్వారా ఆహార శుద్ధి రంగంలో గల వివిధ అవకాశాలు, పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలపై అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. కొత్తగా ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు నిరుద్యోగ యువత, స్వయం సహాయక బృందాలు, సభ్యులు ఒక్కరిగా గానీ, గ్రూప్‌గా గానీ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చని చెప్పారు. పీఎంఎఫ్ఎంఈ స్కీం ద్వారా కొత్తగా పరిశ్రమలు ఏర్పాటుకయ్యే మొత్తం ఖర్చులో 10 శాతం రుసుం లబ్ధిదారులు భరించగా, 90 శాతం రుసుం బ్యాంక్ ద్వారా లోన్ రూపంలో అందజేయడం జరుగుతుందన్నారు. పరిశ్రమ ఏర్పాటు పూర్తయిన తర్వాత ప్రభుత్వ సహకారంగా 36 శాతం సబ్సిడీ బ్యాంకుకు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. గరిష్ఠంగా ప్రభుత్వ సబ్సిడీ రూ.10 లక్షల వరకు సహాయం చేసే అవకాశాలున్నాయని చెప్పారు. ఇప్పటికే ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉన్న వారు, ప్రస్తుతం ఉన్న పరిశ్రమను ఇంకా అభివృద్ధి చేసుకోవడానికి కూడా ఈ సబ్సిడీ పొందవచ్చన్నారు. ఆసక్తి గల వారు 7995087039, 6304930318, 9700051235 నంబర్లలో సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ కె. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి సంబరాలు



రాంకీ కమర్షియల్ హబ్‌లో సంక్రాంతి సంబరాలను తిలకిస్తున్న ఎండీ లాల్‌కృష్ణ



సంక్రాంతి సంబరాల్లో కోలాటం చేస్తున్న చిన్నారులు



సింహగిరిపై ముగ్గులు వేస్తున్న మహిళలు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో రాంకీ ఆధ్వర్యంలో స్థానిక కమర్షియల్ హబ్ ఆవరణలో సంక్రాంతి సంబరాలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఫార్మా ఉద్యోగులకు ముగ్గులు, పతంగుల ఎగరవేత, నృత్య ప్రదర్శన, పాటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. రాంకీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.పి.లాల్‌కృష్ణ మాట్లాడుతూ సంక్రాంతి పండగ సంస్కృతిని భావి తరాలకు తెలియజేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. సంక్రాంతి పండగ ప్రాముఖ్యతను వివరించి ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. సంక్రాంతి సంబరాల్లో రాంకీ ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

సింహాచలం: సింహగిరిపై సంక్రాంతి పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆలయ రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో మహిళలు ముగ్గులను రంగులతో తీర్చిదిద్దారు. దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలు ముదుండి రాజేశ్వరి పోటీలను పర్యవేక్షించారు. శనివారం ఉదయం కూడా ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేస్తారు.

పోలీసులకు సమాచారం ఇవ్వండి

పరవాడ: సంక్రాంతి పండగకు ఇళ్లు విడిచి వెళ్లే వారు ముందుగా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పరవాడ సీఐ పి.ఈశ్వర రావు కోరారు. దాని ద్వారా నిఘా ఏర్పాటు చేయడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే కోడి పందాలు ఆడడం, నిర్వహించడం చట్టరీత్యానేరమన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించవద్దని సూచించారు. పోలీసులతో సహకరించాలని కోరారు.

గోదాదేవి పెళ్లి కూతురాయె..



గోదాదేవి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు రామానుజమ్



పూజల్లో పాల్గొన్న భక్తులు

వెంకటాద్రిపై విశేషంగా ధనుర్మాస పూజలు

సింహాచలం: పెందుర్తి వెంకటాద్రిపై శుక్రవారం ధనుర్మాస పూజలు విశేషంగా నిర్వహించారు. తెల్లవారుజామున వెంకన్నకు, గోదాదేవి అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం తిరుప్పావై సేవాకాలం శాస్త్రోక్తంగా జరిపారు. తదపరి గోదాదేవిని పెళ్లికూతురుగా ముస్తాబు చేసి స్వామి సన్నిధిలో వేంచేయజేశారు. మహిళలు సామూహికంగా కుంకుమపూజ చేశారు. అలాగే అమ్మవారికి తిరువీధి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని,స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో పూజలు విశేషంగా జరిగాయి.నేడు కల్యాణం నిర్వహించనున్నారు.

వెంకన్న ఆలయంలో..



విశేష అలంకరణలో గోదాదేవి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ధనుర్మాస పూజలు విశేషంగా జరిగాయి. గోదాదేవి అమ్మవారిని విశేషంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. తిరుప్పావై సేవాకాలం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని, వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు భార్గవ్ పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు



పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరవాడ, నాయుడుపాలెం, వాడచీపురుపల్లి గ్రామాల్లో శుక్రవారం వేకువ జామున 29వ రోజు మేలుకొలుపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు భగవంతుని నామం జపిస్తూ పల్లకిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మేలుకొలుపులో భగవంతుని నామం పలకడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. మంచి మార్పు వచ్చి ఉన్నత లక్ష్యం వైపు అడుగులు పడతాయని దేవాలయ కమిటీ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు సూచించారు. మేలుకొలుపు కార్యక్రమంలో మాతృమూర్తులు, గ్రామ సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య, పెద్దలు మాసవరపు అప్పలనాయుడు, కూండ్రపు సన్యాసి నాయుడు, కూండ్రపు శ్రీరామ్మూర్తి, దుంగల అప్పారావు, కడిమిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా ధారోత్సవాలు



అమ్మవార్లకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



అమ్మవార్ల చెంత పాశుర పారాయణ చేస్తున్న స్థానాచార్యులు

సింహాచలం: సింహగిరిపై శుక్రవారం నాలుగోరోజు ధారోత్సవాలు ఘనంగా జరిగాయి. వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఒక పల్లకిలో, మరో పల్లకిలో సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు, గోదాదేవి అమ్మవారిని తిరువీధిగా గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వేదికపై అమ్మవార్లను అధిష్ఠంపజేసి పంచామృతాభిషేకం చేశారు. గంగధార వద్ద ఉన్న పురాతన మండపంలో స్వామిని, అమ్మవార్లను అధిష్ఠంపజేసి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజా గర్జన జయప్రదం చేయండి



ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తిరుమల యాత్ర చేసిన కార్మికులను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 30న నిర్వహించనున్న ప్రజా గర్జనను విజయవంతం చేయాలని స్టీల్ సీఐటీయూ నాయకులు కోరారు. స్టోర్స్ కూడలి వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర నిర్ణయాన్ని రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు విడివిడిగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. వారందరినీ ఒక వేదికపైకి తీసుకు రావాలన్న ప్రధాన ఆశయంతో ప్రజా గర్జన బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చడం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తిరుమల పాదయాత్ర చేసిన ట్రాఫిక్ విభాగం కార్మికుడు రామారావు, బీఎఫ్ విభాగం కార్మికుడు సైనిబాబులను ఈ సందర్భంగా సత్కరించారు. యూనియన్ నాయకులు జె. అయోధ్యరామ్, య.రామస్వామి, పి. శ్రీనివాసరాజు, పుల్లారావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నిర్ణయం పాలకుల అవగాహనా రాహిత్యమే..!

- ఉత్తరాంధ్రకు ఉక్కు పరిశ్రమ ఎంత ముఖ్యమో తెలియకపోవడం దురదృష్టకరం
- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 701వ రోజుకు రిలే దీక్షలు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న వరసాల శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం: ఉత్తరాంధ్ర వెనుకబాటుపై మాట్లాడే నేతలకు ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రధాన భూమిక పోషించిన విశాఖ ఉక్కు ప్రాధాన్యం తెలియకపోవడం దురదృష్టకరమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశం నేటి పాలకుల అవగాహన రాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో 701వ రోజు శుక్రవారం సంస్థకు చెందిన ఎస్ఎంఎస్ విభాగ కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణకు తోడ్పడకుండా రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాల నష్టాల్లోకి నెట్టిన కేంద్రప్రభుత్వం వైఖరి మార్చుకోవాలన్నారు. రానున్న కాలంలో లక్షలాది మంది కార్మికులు కర్షకులు, నగర పౌరులతో సమావేశం నిర్వహించి, విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా ప్రజలను చైతన్యం చేసే విధంగా కార్మికులు కృషి చేయాలన్నారు. ఈ నెల 30న జరప తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జనను కార్మికులు, వారి కుటుంబసభ్యులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీవీ రమణమూర్తి, జగదీష్, రంజిత్, సంజీవ్, రామరాజు, గిరిబాల యోగి, రాజేంద్ర, వరప్రసాద్, సాయి, శివ, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మల్కాపురం: స్థానిక దుర్గానగర్‌లోని ఓ ఇంట్లో రహస్యంగా పేకాట ఆడుతున్న ముగ్గురు పోలీసులకు పట్టుబడ్డారు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు ..దుర్గానగర్‌లో గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడ వెళ్లి ఆ వ్యక్తులను పట్టుకుని వారి నుంచి రూ. 17 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ లూథర్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సత్తా చాటిన ఆంధ్రా బాడీ బిల్డర్లు



మిస్టర్ ఇండియా పోటీల్లో సత్తా చాటిన రాజేష్

అల్లిపురం: పశ్చిమ బంగాల్‌లో ఈ నెల 11, 12 తేదీల్లో జరిగిన 57వ మిస్టర్ ఇండియా-2023 పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాడీ బిల్డర్లు పాల్గొని తమ సత్తా చాటారు. దేశ నలుమూలల నుంచి 29 రాష్ట్రాలకు చెందిన బాడీ బిల్డర్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 65 కేజీల విభాగంలో పోటీ పడ్డ రాజేష్ ప్రథమ స్థానంతో పాటు ఓవరాల్ చాంపియన్ షిప్ రన్నరప్‌గా నిలిచి ఆంధ్రప్రదేశ్ కీర్తి, ఖ్యాతిని దేశం నలుమూలలా చాటారు. అలాగే 70 కేజీల కేటగిరీలో సంగడి రమేష్ ద్వితీయ స్థానం సాధించగా, 80 కేజీల విభాగంలో నార్ని శివదుర్గా అవినాష్ మూడో స్థానం సాధించారు. మాస్టర్ విభాగంలో కె.రామునాయుడు నాలుగో స్థానంలో సత్తా చాటారు. ఏపీ నుండి పాల్గొన్న వారందరూ టాప్ 10లో నిలిచారు. మిస్టర్ ఇండియా పోటీల్లో పతకాలు సాధించిన వారందరికీ ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.గురునాథరావు, కోశాధికారి టి.రాము, ఆర్గనైజింగ్ సెక్రటరీలు వి.విజయకుమార్, జోగి కిరణ్, ఉపాధ్యక్షుడు బీపీ రెడ్డి, జి.విష్ణుమూర్తి అభినందనలు తెలిపారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు



మాట్లాడుతున్న అప్పలనాయుడు

సబ్బవరం: రైతుల నుంచి ధాన్యం పారదర్శకంగా కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ విరోతి అప్పలనాయుడు సూచించారు. మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాల వద్ద రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు దళారీల బెడద కూడా ఉండదని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు కొనుగోళ్లలో ఎలాంటి సమస్యలు ఎదురైనా మండల వ్యవసాయ కేంద్రాన్ని సంప్రదించవచ్చన్నారు. రబీ సీజన్‌లో వేసిన పంటలకు సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. ఏవో పోతల సత్యనారాయణ, మండల వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్లు బోకం కాసుబాబు, చీపురుపల్లి సూర్యనారాయణ,కడియాల వెంకట రమణ,సూరిశెట్టి రాము, ఏఈవో బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నృసింహ దీక్ష విరమణ



ఘాట్‌రోడ్డులో తిరుముడులతో వస్తున్న దీక్షాధారులు

సింహాచలం: అడవివరానికి చెందిన సింహాద్రి మఠం ఆధ్వర్యంలో శ్రీనృసింహ దీక్షల విరమణ శుక్రవారం శాస్త్రోక్తంగా జరిగింది. మండల దీక్ష, 32రోజుల దీక్ష చేసిన 3860 మంది భక్తులు సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో దీక్షా విరమణ చేశారు. దీక్ష విరమించినవారిలో విశాఖ ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. దీక్షాదారులంతా ఘాట్ రోడ్డు, మెట్లమార్గంలో తిరుముడులతో సింహగిరికి చేరుకున్నారు. అనంతరం సింహగిరిపై ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో దీక్ష విరమణ చేశారు. దేవస్థానం తరపున దీక్షాదారులందరికీ స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



బోదువలసలో వీధిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

సబ్బవరం: పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులను నివారించవచ్చునని అనకాపల్లి డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ అన్నారు. మండలంలోని గుల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులు పరిశీలించారు. అనంతరం నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో శానిటేషన్, క్లీనింగ్ ప్రక్రియపై ఆరా తీశారు. లేబర్ రూమ్,ఆపరేషన్ థియేటర్ ,లేబరేటరీ,వార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం బోదువలస గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను పరిశీలించారు. గ్రామంలోని గురుకుల పాఠశాలను సందర్శించి యుక్త వయస్సు బాలికలకు రక్తహీనత,వ్యక్తిగత పరిశుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డ్రైడే-ఫ్రైడే గ్రామంలోని వీధుల్లో తిరిగి లార్వా ఎలిమినేషన్‌ను పరిశీలించారు. సాగ్ గోల్స్,ఎనీమియా మానిటరింగ్ టూల్ గురించి అంగన్‌వాడీ, ఏఎన్ఎంలకు పలు సూచనలు చేశారు.

108 రకాల స్వీట్లతో సారె సమర్పణ



సారె ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



అమ్మవారికి నివేదించిన 108 రకాల స్వీట్లు

సీతంపేట: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అక్కయ్యపాలెం లలితా నగర్‌లోని లలితా పీఠంలో భోగి పండగ నాడు గోదా రంగనాయకుల కల్యాణం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా అమ్మవారి భక్తులు శుక్రవారం సాయంత్రం సారె ఊరేగింపు నిర్వహించారు. పలువురు భక్తులు, మహిళలు పాల్గొని పసుపు, కుంకుమ, గాజులు, చీర, పువ్వులు, పండ్లు, 108 రకాల స్వీట్లు సారెలో ఊరేగించారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో అమ్మవారికి నివేదించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

‘112’ స్పందన అద్వితీయం

గంటలో బాధితురాలికి నగదు బ్యాగ్ అందజేత



ఆదిలక్ష్మి సమక్షంలో ఆటో డ్రైవర్‌కు నగదు పారితోషికం అందిస్తున్న సీఐ దుర్గా ప్రసాద్, ఎస్ఐ నర్సింగరాజు

గోపాలపట్నం: ఆటోలో బ్యాగ్ పోగొట్టుకున్న బాధితురాలికి గంటలో నగదు ఉన్న బ్యాగు అందించి గోపాలపట్నం క్రైం పోలీసులు ప్రశంసలు అందుకున్నారు. గోపాలపట్నం క్రైం ఎస్ఐ ఎస్ నర్సింగరాజు తెలిపిన వివరాలు.. గాజువాకకు చెందిన ఆదిలక్ష్మి భర్త పిల్లతో బొబ్బిలి వెళ్లేందుకు సింహాచలం రైల్వే స్టేషన్‌కు వచ్చింది. అయితే వీరు వచ్చే సరికి ట్రైన్ వెళ్లి పోవడంతో సింహాచలం రైల్వే స్టేషన్ నుంచి సింహాచలం బస్ కాంప్లెక్స్‌కు ఆటోలో వెళ్లారు. అక్కడ దిగినపుడు ఆటోలో బ్యాగ్ మర్చిపోయారు. ఆటో డ్రైవర్ కూడా చూడకుండా వెళ్లిపోయాడు. ఆ వెంటనే బ్యాగ్ ఆటోలో మర్చిపోయినట్లు గుర్తించి 112కి ఫోన్‌చేసి ఫిర్యాదు చేసింది. దీంతో వెంటనే స్పందించిన క్రైం డీసీపీ నాగన్న ఆదేశాలతో సీఐ కూన దుర్గా ప్రసాద్ పర్యవేక్షణలో గోపాలపట్నం ఎస్ఐ ఎస్ నర్సింగరాజు దర్యాప్తు చేపట్టారు. సీసీపుటేజీల ఆధారంగా గంటలో ఆటోను గుర్తించి పట్టుకున్నారు. ఆటో డ్రైవర్ కనకరాజు ఆటోలో బ్యాగ్ ఉన్నట్లుగా గమనించలేదు. తీరా అందులో తనిఖీ చేయగా రూ.70వేల నగదు ఉంది. బాధితురాలు చెప్పిన విధంగా నగదు ఉండడంతో ఆమెకు నగదు ఉన్న దుస్తుల బ్యాగ్ అందించారు. నిజాయితీగా బ్యాగ్‌ను అందించి ఆటో డ్రైవర్‌కు రూ. 2000 నగదు అందించి అభినందించారు.